అదానీ సేవలో తరిస్తున్న మోడీ సర్కార్

- భారత గ్రిడ్‌కు గొడ్డా ప్లాంట్ అనుసంధానం
- కొత్త ట్రాన్స్‌మిషన్ పవర్ లైన్‌కు మార్గం సుగమం

న్యూఢిల్లీ : భారత్‌కు చెందిన బడా వ్యాపారవేత్త అదానీ సేవలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పరితపిస్తోంది. ఆయనకు కష్టం వస్తే ఆదుకునేందుకు ముందుండే కేంద్ర ప్రభుత్వం.. మరోసారి దానిని నిరూపించింది. జార్ఖండ్‌లోని గొడ్డా థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఇండియన్ నేషనల్ ఎలక్ట్రిసిటీ గ్రిడ్‌కు అనుసంధానించేందుకు లైన్ క్లియర్ చేసింది. ఇందుకు అదానీ పవర్ లిమిటెడ్ (ఎపిఎల్)కు అనుమతినిచ్చింది. అంతర్జాతీయ ఒప్పందం ప్రకారం ఇప్పటివరకు ఈ ప్లాంట్ నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్ మొత్తం బంగ్లాదేశ్‌కు సరఫరా అయ్యేది. ఇప్పుడు దీనిని భారత గ్రిడ్‌కు అనుసంధానిస్తూ మోడీ సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వటం గమనార్హం. తాజా నిర్ణయంతో ఏపీఎల్ ఇప్పుడు గొడ్డా ప్లాంట్‌ను భారతదేశ ఇంటర్-స్టేట్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ (ఐఎస్‌టిఎస్)కు అనుసంధానించే కొత్త ట్రాన్స్‌మిషన్ లైన్ (పవర్‌లైన్)ను వేస్తుంది. ఇది రాష్ట్రాల మధ్య విద్యుత్‌ను తరలించే హై-వోల్టేజ్ జాతీయ గ్రిడ్. ఇది ఇప్పటికే ఉన్న కహల్గావ్ ఏ- మైథాన్ బి 400 కెవి లైన్‌కు లైన్-ఇన్-లైన్-అవుట్ (ఎల్ఐఎల్ఓ) కనెక్షన్‌ను ఉపయోగించి చేయబడుతుంది. ఈ ట్రాన్స్‌మిషన్ లైన్ గొడ్డా జిల్లాలోని 56 గ్రామాల గుండా వెళ్లనున్నది. మోడీ సర్కార్.. అదానీ పవర్‌కు కొన్ని న్యాయ అధికారాలనూ కట్టబెట్టింది. ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్, 1885 కింద టెలిగ్రాఫ్ అథారిటీకి ఉండే అధికారాలనే కేంద్రం అదానీ పవర్‌కు కల్పించింది. దీని అర్థం.. ప్రయివేటు ప్రాపర్టీ మీదుగా స్తంభాలు, లైన్లను వేసే అధికారం ఉంటుంది. అయితే దీనికి కొన్ని షరతులు ఉంటాయి. ఎలక్ట్రిసిటీ యాక్ట్, 2003లోని సెక్షన్ 164ను అనుసరించి ఈ అధికారాలను కట్టబెట్టారు.

కేంద్రం నిర్ణయంపై ఆందోళనలు

అయితే అదానీ పవర్‌కు మోడీ సర్కార్ మార్గం సుగమం చేసేలా అనుమతివ్వటంపై పలు అనుమానాలు, ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే.. గొడ్డా ప్లాంట్ స్పెషల్ ఎకనామిక్ జోన్ (సెజ్)లో ఉన్నది. మార్చి, 2019లో అప్పటి కేంద్ర ప్రభుత్వమే ఈ ప్రకటన చేసింది. ప్రత్యేకించి బంగ్లాదేశ్‌కు విద్యుత్‌ను ఎక్స్‌పోర్ట్ చేసేందుకు ఈ ప్లాంట్‌ను నిర్మించారు. అయితే గతేడాది ఆగస్టులో బంగ్లాదేశ్‌లో అక్కడి ప్రభుత్వం మారింది. కొత్త వచ్చిన తాత్కాలిక ప్రభుత్వం గొడ్డా ప్లాంట్ నుంచి విద్యుత్ కొనుగోలును తగ్గించటం, లేదా ఆపేయటం చేసింది. దీంతో బంగ్లాదేశ్‌కు అవసరం లేకుంటే.. వినియోగంలో లేని ఈ విద్యుత్‌ను భారత్‌లో విక్రయించటానికి అనుమతి కోసం అదానీ పవర్ అభ్యర్థించింది. అదానీ పవర్ కోసం పలు ప్రభుత్వ ఏజెన్సీలు కదిలాయి. నిబంధనలు, మార్గదర్శకాలను సవరించాయి.

కదిలిన ప్రభుత్వ యంత్రాంగాలు.. మారిన నిబంధనలు, మార్గదర్శకాలు

భారత్‌లో విద్యుత్ విక్రయానికి అనుమతి కోసం గతేడాది ఆగస్టులో అదానీ కంపెనీ అనుమతి కోరింది. దీంతో విద్యుత్ మంత్రిత్వ శాఖ క్రాస్-బోర్డర్ ఎలక్ట్రిసిటీ ట్రేడ్ గైడ్‌లైన్స్‌ను గతేడాది ఆగస్టులో సవరించింది. ఇక గతేడాది ఆగస్టులోనే కేంద్ర విద్యుత్ సంస్థ (సిఇఎ) కూడా తన సాంకేతిక నిబంధనలను మార్చింది. కేంద్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ (సిఇఆర్‌సి) సైతం తన నియమాలను అదే ఏడాది డిసెంబర్‌లో సవరించింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో కేంద్రం ట్రాన్స్‌మిషన్ కనెక్షన్‌కు అధికారికంగా ఆమోదం తెలిపింది. తాజాగా కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంతో అదానీ గొడ్డా ప్లాంట్ నుంచి భారత గ్రిడ్‌కు విద్యుత్ సరఫరాకు మార్గం సుగమమైంది. ఈ అనుమతి 25 ఏండ్ల పాటు చెల్లుబాటు అవుతుంది. ఎపిఎల్.. రైల్వే, రహదార్లు, ఏవియేషన్, రక్షణ వంటి స్థానిక, జాతీయ సంస్థల నుంచి తప్పక అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ ట్రాన్స్‌మిషన్ రూట్ అనేది జిఐబి ప్రొటెక్టెడ్ జోన్స్ గుండా వెళ్తే.. కంపెనీ సుప్రీంకోర్టు జారీ చేసిన పర్యావరణ నిబంధనలను తప్పక పాటించాల్సి ఉంటుంది.

ప్లాంట్ నేపథ్యం

అదానీకి చెందిన గొడ్డా ప్లాంట్ 1600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన థర్మల్ పవర్ స్టేషన్. ఇది జార్ఖండ్‌లోని గొడ్డాలో ఉన్నది. ఇది భారతదేశపు మొట్టమొదటి అంతర్జాతీయ విద్యుత్ ప్రాజెక్ట్. దీని ప్రధాన లక్ష్యం బంగ్లాదేశ్‌కు విద్యుత్‌ను సరఫరా చేయడం. ఈ ప్లాంట్ అదానీ గ్రూప్ అనుబంధ సంస్థ అయిన అదానీ పవర్ ద్వారా నిర్వహించబడుతోంది. 2019లో ఈ ప్లాంట్‌ను స్పెషల్ ఎకనామిక్ జోన్‌గా ప్రకటించారు. దీంతో పన్నులు, సుంకాలపై గణనీయమైన రాయితీలను ఈ ప్లాంట్ పొందింది. బంగ్లాదేశ్ పవర్ డెవలప్‌మెంట్ బోర్డు (బిపిడిబి)తో చేసుకున్న దీర్ఘకాలిక ఒప్పందం ప్రకారం ఈ ప్లాంట్ బంగ్లాదేశ్‌కు విద్యుత్‌ను సరఫరా చేస్తోంది. 2023లో ఇది పూర్తిస్థాయి వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించింది. 2024 ఆగస్టులో బంగ్లాదేశ్‌లో పాలనా మార్పుల తర్వాత.. మోడీ ప్రభుత్వం ఈ ప్లాంట్‌ను భారతీయ పవర్ గ్రిడ్‌కు తాత్కాలికంగా అనుసంధానిం చడానికి అనుమతినిచ్చింది. బంగ్లాదేశ్ నుంచి డిమాండ్ తక్కువగా ఉన్నప్పుడు లేదా చెల్లింపుల్లో సమస్యలు తలెత్తినప్పుడు ఈ ప్లాంట్ నుంచి భారత్‌లోని గ్రిడ్‌కు విద్యుత్ సరఫరా చేయడానికి ఇది వీలు కల్పించింది. కేంద్రం తాజా ఆమోదంతో ఈ అనుసంధానానికి 25 ఏండ్ల పాటు శాశ్వత ఆమోదం లభించినట్టయ్యింది.

గొడ్డా ప్లాంట్‌పై పలు వివాదాలు

అదానీ గొడ్డా ప్లాంట్‌పై ఇప్పటికే అనేక వివాదాలు ఉన్నాయి. బంగ్లాదేశ్‌లో ఈ ప్లాంట్ నుంచి అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేయడంపై విమర్శలు వచ్చాయి. ఇక భూసేకరణ చట్టం-2013 ను ఉల్లంఘించి మరీ బలవంతంగా భూములను స్వాధీనం చేసుకున్నారనే ఆరోపణలూ వెల్లువెత్తాయి. ఆ సమయంలో స్థానిక రైతులు, గిరిజనులు దీనిపై నిరసనలు కూడా చేశారు. ఈ ప్లాంట్ నిర్మాణంతో పర్యావరణ కాలుష్యం పెరుగుతుందనీ, కార్మికులకు సరైన ఉపాధి ప్పందాలు లేవని పర్యావరణవేత్తలు, కార్మిక సంఘాల నుంచి ఆందోళనలూ వ్యక్తమయ్యాయి. ఇక విద్యుత్ ఎక్స్‌పోర్ట్ కోసం సెజ్ హోదా పొందినప్పటికీ.. ఈ ప్లాంట్ దేశీయంగా విద్యుత్‌ను విక్రయించేందుకు నిబంధనలను మార్చడం అదానీ గ్రూపునకు మాత్రమే లబ్దిని చేకూరుస్తుందని విశ్లేషకులు, మేధావులు ఆరోపిస్తున్నారు.

మోడీతో సమావేశమైన హరిణి

శ్రీలంక ప్రధానితో మోడీ భేటీ

న్యూఢిల్లీ : ప్రస్తుతం భారత్‌లో పర్యటిస్తున్న శ్రీలంక ప్రధాని హరిణి అమరసూర్య శుక్రవారం ప్రధాని నరేంద్ర మోడీతో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. అభివృద్ధి సహకారం, భారత జాలర్ల సంక్షేమం వంటి పలు అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. విద్య, మహిళా సాధికారత, వినూత్న ఆవిష్కరణలు, అభివృద్ధి సహకారం వంటి పలు అంశాలపై శ్రీలంక ప్రధానితో సమగ్రంగా చర్చలు జరిపామని మోడీ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఇరుగు పొరుగు దేశాలుగా, మన సహకారం మన రెండు దేశాల ప్రజల సంక్షేమానికి చాలా కీలకమైనదని మోడీ పేర్కొన్నారు.

మంత్రిగా ప్రమాణం చేస్తున్న రివబ జడేజా

గుజరాత్‌లో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ

- డిప్యూటీ సిఎంగా హర్ష్ సంఘవి

గాంధీనగర్ : గుజరాత్‌లో మంత్రివర్గాన్ని పునవ్యవస్థీకరించారు. శుక్రవారం 25 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ ఆచార్యదేవవ్రత్ కొత్త మంత్రుల చేత ప్రమాణస్వీకారం చేయించారు. పాత మంత్రుల్లో ఆరుగురికి మాత్రమే మళ్లీ అవకాశం లభించింది. 19 మంది కొత్తగా మంత్రివర్గంలో చేరారు. రాష్ట్ర హోం మంత్రి హర్ష్ సంగవి ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ప్రముఖ క్రికెటర్ రవీంద్ర జడేజా భార్య రివబ జడేజాకు మంత్రి పదవి లభించింది. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ కోసం ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మినహా మిగిలిన మంత్రులంతా గురువారం రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. బిజెపి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర స్థాయిలో అసంతృప్తి వ్యక్తమవుతున్న నేపథ్యంలో కేబినెట్‌లో మార్పులుచేర్పులు చేయడం విశేషం.

యుపిలో దళితులకు రక్షణ కరువు

- కాంగ్రెస్ నేత రాహుల్ విమర్శ
- మూకదాడిలో హత్యకు గురైన హరిఓం కుటుంబానికి పరామర్శ

రాయ్‌బరేలి : ఉత్తరప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వ హయంలో దళితులకు, పేదలకు రక్షణ కరువైందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాహుల్ గాంధీ విమర్శించారు. యుపిలోని రాయ్‌బరేలి నుంచి ఆయన ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నెల 2న రాయ్‌బరేలిలో కొందరు గూండాలు హరిఓం వాల్మీకి అనే దళితుడిని కొట్టి చంపారు. ఈ నేపథ్యంలో మృతుడి మామ చౌదరి భక్తిదాస్, ఇతర కుటుంబ సభ్యులను శుక్రవారం నాడు రాహుల్ పరామర్శించారు.

ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ దళితులను రక్షించడంలో, మూకదాడులను అరికట్టడంలో యోగి సర్కార్ ఘోరంగా విఫలమైందన్నారు. కాగా రాహుల్ పరామర్శకు వస్తున్నారన్న నేపథ్యంలోనే మృతుడి సోదరికి ఫతేపూర్ మెడికల్ కాలేజీలో స్టాఫ్ నర్సుగా (కాంట్రాక్ట్ పద్ధతిలో) నియమిస్తూ యోగి సర్కార్ ఆఫర్ లెటర్ అందజేయడం గమనార్హం.

టిటిడి కల్తీ నెయ్యి కేసులో బ్యాంకు వివరాలు అడుగుతున్నారు

- హైకోర్టుకు తెలిపిన వైవి సుబ్బారెడ్డి భార్య

ప్రజాశక్తి-అమరావతి

తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారంపై సిబిఐ ఆధ్వర్యాన సిట్ తనకు చెందిన హైదరాబాద్, శ్రీనగర్ కాలనీ యాక్సిస్ బ్యాంక్ బ్రాంచ్‌లోని ఖాతా, ఇతర వివరాలు కోరడాన్ని వైసిపి రాజ్యసభ సభ్యుడు వైవి సుబ్బారెడ్డి భార్య స్వర్ణలత హైకోర్టులో సవాల్ చేశారు. లంచ్‌మోషన్ పిటిషన్‌ను జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప శుక్రవారం విచారించారు. ఇప్పటికే యాక్సిస్ బ్యాంకు నుంచి పొందిన వివరాలతో సిబిఐ సిట్ దర్యాప్తు కొనసాగించవచ్చునని చెప్పారు. తిరిగి ఉత్తర్వులు ఇచ్చే వరకు యాక్సిస్ బ్యాంకు నుంచి ఇంకేమీ వివరాలు కోరరాదని సిబిఐ సిట్‌ను ఆదేశించారు. కౌంటర్ దాఖలు చేయాలన్నారు. విచారణను ఈ నెల 31కి వాయిదా వేశారు.

కల్తీ నెయ్యి కేసులో పిటిషనర్ సాక్షి లేదా నిందితురాలు కాదని పిటిషనర్ న్యాయవాది వాదించారు. కాబట్టి పిటిషనర్ బ్యాంకు ఖాతాలు, స్టేట్ మెంట్ల వివరాలను కోరడం చెల్లదన్నారు. సిబిఐ సిట్ తరపున న్యాయ వాది పిఎస్‌పి సురేష్ కుమార్ స్పందిస్తూ, పిటిషనర్‌కు ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులివ్వొద్దని వాదించారు. మధ్యంతర ఉత్తర్వులిస్తే దర్యాప్తునకు అవరోధం ఏర్పడుతుందన్నారు.


నామినేషన్ దాఖలుకు ముందు నిర్వహించిన ర్యాలీలో భభూతిపుర్ సిపిఎం అభ్యర్థి అజయ్ కుమార్, పాలిట్‌బ్యూరో సభ్యులు ఆమ్రారామ్ తదితరులు

ప్రజాగళం వినిపిస్తాం

- బీహార్‌లో సిపిఎం అభ్యర్థులు
- నామినేషన్లు దాఖలు

పాట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపిస్తే..ప్రజాగళం వినిపిస్తామని సిపిఎం అభ్యర్థులు తెలిపారు. మహాగట్ బంధన్ తరపున నలుగురు సిపిఎం అభ్యర్థులు బరిలో దిగుతున్నారు. బిభూతిపూర్ నుంచి అజయ్ కుమార్, మాంఝీ నుంచి సత్యేంద్రయాదవ్, హయాఘట్ నుంచి శ్యాం భారతి, పిప్రా నుంచి రాజ్‌మంగళ్ ప్రసాద్ పోటీ చేస్తున్నారు. శుక్రవారం బిభూతిపూర్ అసెంబ్లీ స్థానానికి సిపిఎం అభ్యర్థి అజయ్ కుమార్ నామినేషన్ పత్రం దాఖలు చేశారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ, బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పొలిట్‌బ్యూరో సభ్యులు అమ్రారామ్ హాజరయ్యారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ లాలన్ చౌదరి, కేంద్ర కమిటీ సభ్యులు అవ్ధేష్ కుమార్ కూడా ఉన్నారు.

కుల దురహంకార హత్యల నివారణకు కమిషన్

- అసెంబ్లీలో ప్రకటించిన ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై : పరువు పేరుతో కులాల ప్రాతిపదికన జరిగే విద్వేష నేరాలు, హత్యలను నివారించేందుకు ఒక చట్టాన్ని రూపొందించడంపై అవసరమైన చర్చలు, సంప్రదింపులు జరిపేందుకు కమిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ శుక్రవారం అసెంబ్లీలో ప్రకటించారు. మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కెఎన్ బాషా నేతృత్వాన ఈ కమిషన్ ఏర్పాడుతుందని, ఈ కమిషన్ విస్తృతంగా చర్చలు, సంప్రదింపులు జరిపి ప్రభుత్వానికి తన సిఫార్సులను అందచేస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ కమిషన్‌లో న్యాయ నిపుణులు, ప్రగతిశీల ఆలోచనాపరులు, ప్రముఖ సామాజికవేత్తలు వుంటారని తెలిపారు. రాజకీయ సంఘాలు, సంస్థలతో, న్యాయ నిపుణులతో, సామాజిక కార్యకర్తలతో, బాధితులతో ఈ కమిషన్ చర్చలు జరుపుతుంది. వారి నుండి సూచనలు తీసుకుని, ప్రభుత్వానికి కొన్ని సిఫార్సులు చేస్తుందని చెప్పారు. వీటి ప్రాతిపదికగా, రాష్ట్ర ప్రభుత్వం కుల ప్రాతిపదికన లేదా పరువు కోసం జరిగే హత్యలను నివారించడంపై చట్టాన్ని రూపొందిస్తుందని తెలిపారు.

జనగణన-2027 నోటిఫికేషన్ జారీ

- వచ్చే నెలలో ముందస్తు సర్వే

న్యూఢిల్లీ : జనగణన - 2027కు కేంద్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఇందుకు సంబంధించిన కసరత్తు వచ్చే నవంబరు నెల నుంచే ప్రారంభం కానుంది. ఈ మేరకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ శుక్రవారం నాడు ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. ముందస్తు సర్వే ప్రక్రియ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎంపిక చేసిన నమూనా ప్రాంతాల్లో గృహ జాబితా, గృహ గణనను కవర్ చేస్తుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. జనగణన-2027 తొలి దశ కోసం చేపట్టే ముందస్తు సర్వేను సులభతరం చేయడానికి 1948 జనాభా లెక్కల చట్టంలోని నిబంధనలను పొడిగిస్తూ కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ ఈ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. దీని ప్రకారం 2027లో చేపట్టే జనాభా లెక్కలకు వచ్చే నెల నవంబర్ 10 నుంచి 30 వరకు ముందస్తు సర్వే చేపట్టనున్నారు. నివాసితులకు నవంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు స్వీయ గణనకు అవకాశం కల్పించారు. ప్రధాన సర్వేకు ముందు వారు డిజిటల్‌గా సమాచారాన్ని పొందుపర్చడానికి ఏర్పాట్లు చేశారు. 2027లో రెండు దశల్లో జనగణన చేపట్టనున్నారు. దీంతో పాటే కులగణన కూడా చేపట్టనున్నట్టు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తెలిపింది.

పాస్‌పోర్ట్ సూచీలో భారత్‌కు 85వ స్థానం

న్యూఢిల్లీ : హెన్లీ పాస్‌పోర్ట్ సూచీ-2025లో భారత్ 85వ స్థానానికి పడిపోయింది. 57 దేశాలకు వీసా లేకుండా ప్రయాణించే అవకాశాన్ని కల్పిస్తోంది. గతేడాది 62 గమ్యస్థానాలకు వీసా రహిత ప్రయాణ అవకాశంతో ఇదే జాబితాలో 80వ స్థానంలో ఉండేది. కాగా 193 దేశాలకు వీసా రహిత ప్రయాణ అవకాశంతో సింగపూర్ అత్యంత శక్తివంతమైన పాస్‌పోర్ట్‌గా కొనసాగుతోంది. ఈ సంవత్సరం 190 దేశాలతో దక్షిణ కొరియా రెండవ స్థానంలో, 189 దేశాలకు ప్రయాణించడానికి అనుమతిస్తూ జపాన్ మూడవ స్థానంలో నిలిచింది. జర్మనీ, ఇటలీ, లక్సెంబర్గ్, స్పెయిన్ , స్విట్జర్లాండ్ 4వ స్థానంలోనూ, ఆస్ట్రియా, బెల్జియం, డెన్మార్క్, ఫిన్లాండ్, ఫ్రాన్స్, ఐర్లాండ్ , నెదర్లాండ్స్ 5వ స్థానంలోనూ నిలిచాయి.

కాల్పుల విరమణ ఉల్లంఘనే

- లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడులను ఖండించిన ఇరాన్

తెహ్రాన్ : లెబనాన్‌పై ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న దాడులను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. ఇలా దాడులకు పాల్పడ్డాన్ని హెజ్బోల్లా, ఇజ్రాయిల్‌కు మధ్య జరిగిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని స్పష్టంగా ఉల్లంఘించడమేనని ఇరాన్ విమర్శించింది. ఇజ్రాయిల్ దాడులను ఆపడానికి అంతర్జాతీయ సమాజం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఎస్మాయిల్ బఘై ఒక ప్రకటన విడుదల చేశారు. ఇజ్రాయిల్ నిరంతర దాడులను 'లెబనాన్ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రత స్పష్టమైన ఉల్లంఘన'గా బఘై విమర్శించారు. ఈ ప్రాంతంలో శాంతికి హామీ ఇచ్చిన అమెరికా, ఫ్రాన్స్‌లు ఇప్పుడు నిశ్శబ్దంగా ఉండటాన్ని ఇరాన్ ఈ ప్రకటనలో ఖండించింది. ఇజ్రాయిల్ యుద్ధోన్మాదాన్ని అరికట్టడానికి అంతర్జాతీయ సమాజం కఠినమైన, సమన్వయంతో కూడిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కొత్త బంగ్లాదేశ్ ఆవిర్భావం !

- తాత్కాలిక చీఫ్ యూనస్ వెల్లడి
- జులై చార్టర్‌పై 25 రాజకీయ పార్టీల సంతకాలు
- పార్లమెంట్ వద్ద ఆందోళనల నేపథ్యంలో ప్రకటన

జులై చార్టర్‌ను ఆవిష్కరిస్తున్న తాత్కాలిక చీఫ్ మహ్మద్ యూనస్

ఢాకా : 'జులై చార్టర్' గా పిలిచే జాయింట్ డిక్లరేషన్‌పై సంతకాలతో 'కొత్త బంగ్లాదేశ్' ఆవిర్భవించిందని తాత్కాలిక ప్రభుత్వ చీఫ్ మహ్మద్ యూనస్ శుక్రవారం ప్రకటించారు. పార్లమెంట్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీల నేతలు దీనిపై సంతకాలు చేశారు. దీంతో నూతన బంగ్లాదేశ్ ఆవిర్భవించిందని యూనస్ వ్యాఖ్యానించారు. జులై ఫైటర్లకు దేశం రుణపడి వుందని యూనస్ వ్యాఖ్యానించారు. మాజీ ప్రధాని ఖలీదా జియాకి చెందిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ సహా 25 పార్టీలు దీనిపై సంతకాలు చేశాయని పత్రికా విభాగం తెలిపింది. ప్రభుత్వాన్ని నడిపేందుకు గానూ వివిధ రంగాల్లో 80కి పైగా సంస్కరణల సిఫార్సులను పొందుపరుస్తూ జాతీయ ఏకాభిప్రాయ కమిషన్ ఈ చార్టర్‌ను రూపొందించింది. తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిషన్, రాజకీయ పార్టీల మధ్య బృహత్తరంగా సాగిన చర్చల అనంతరం 'జులై చార్టర్'ను రూపొందించారు. అయితే బంగ్లాదేశ్ తాత్కాలిక నేత మహ్మద్ యూనస్‌కు కీలక మిత్రపక్షమైన నేషనల్ సిటిజన్ పార్టీ (ఎన్‌సిపి) విద్యార్థి విభాగం ఈ డాక్యుమెంట్‌పై సంతకాలు చేయబోమని తెలిపింది. ఈ డాక్యుమెంట్‌కు సరైన చట్ట ప్రాతిపదిక లేదంటూ ఈ సంతకాల కార్యక్రమాన్ని బహిష్కరించింది. జాతీయ ఏకాభిప్రాయం పేరుతో కొన్ని రాజకీయ పార్టీలు ఈ డాక్యుమెంట్‌పై సంతకం చేస్తూ ప్రజల్ని మోసం చేస్తున్నాయని ఎన్‌సిపి కన్వీనర్ నహీద్ ఇస్లామ్ విమర్శించారు. సంతకాల కార్యక్రమానికి కొద్ది గంటల ముందు యూనస్ నేతృత్వంలోని జాతీయ ఏకాభిప్రాయ కమిషన్ ఈ చార్టర్‌కు సవరణను తీసుకువచ్చినట్లు ప్రకటించింది. గతేడాది ఆగస్టులో షేక్ హసీనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు సమయంలో వారు పోషించిన పాత్రకు గానూ జులై ఫైటర్లను గుర్తిస్తూ చార్టర్‌లోని ఒక క్లాజుకు సవరణ తీసుకువచ్చారు. ఎన్‌సిపిని బుజ్జగించేందుకే ఈ సవరించిన ముసాయిదాలో ఫాసిస్ట్ అవామీ లీగ్ అనే పదాలను చేర్చారు. కాగా ఈ చార్టర్‌లోని పలు ప్రతిపాదనలు రాజ్యాంగ విరుద్ధంగా వున్నాయని పేర్కొంటూ వీటిపై అసమ్మతిని వ్యక్తం చేస్తున్నామని అంతకుముందు బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ వెల్లడించింది.

పార్లమెంట్ వద్ద ఆందోళనలు

'జులై చార్టర్' సంతకాల కార్యక్రమాన్ని నిరసిస్తూ వందలాదిమంది ఆందోళనకారులు అక్కడ ఏర్పాటు చేసిన వేదిక వద్దకు చేరారు. వారిని అక్కడ నుండి వెళ్ళిపోవాల్సిందిగా కోరినా ఎవరూ అక్కడ నుండి కదలకపోవడంతో పోలీసులు లాఠీలతో రంగంలోకి దిగారు. బంగ్లాదేశ్ పార్లమెంట్‌కు సమీపంలో మోహరించిన ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయు గోళాలను, గ్రెనెడ్లను ప్రయోగించారు. లాఠీలు ఝుళిపించారు.

గతేడాది ఆగస్టులో షేక్ హసీనా ప్రభుత్వాన్ని గద్దె దింపిన నిరసనల్లో గాయపడిన వారికి చట్టపరమైన రక్షణ కల్పించి, వారికి పునరావాసం కల్పించాలని ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు. నిరసనకారులు అక్కడ గల రెండు పోలీసు వాహనాలను ధ్వంసం చేశారు. ఎంపీల భవనం ముందు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రిసెప్షన్ రూమ్‌ను, కంట్రోల్ రూమ్‌ను, ఫర్నిచర్‌ను తగలబెట్టారు.

కాల్పుల విరమణ ఉల్లంఘనే

- లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడులను ఖండించిన ఇరాన్

తెహ్రాన్ : లెబనాన్‌పై ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న దాడులను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. ఇలా దాడులకు పాల్పడ్డాన్ని హెజ్బోల్లా, ఇజ్రాయిల్‌కు మధ్య జరిగిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని స్పష్టంగా ఉల్లంఘించడమేనని ఇరాన్ విమర్శించింది. ఇజ్రాయిల్ దాడులను ఆపడానికి అంతర్జాతీయ సమాజం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఎస్మాయిల్ బఘై ఒక ప్రకటన విడుదల చేశారు. ఇజ్రాయిల్ నిరంతర దాడులను 'లెబనాన్ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రత స్పష్టమైన ఉల్లంఘన'గా బఘై విమర్శించారు. ఈ ప్రాంతంలో శాంతికి హామీ ఇచ్చిన అమెరికా, ఫ్రాన్స్‌లు ఇప్పుడు నిశ్శబ్దంగా ఉండటాన్ని ఇరాన్ ఈ ప్రకటనలో ఖండించింది. ఇజ్రాయిల్ యుద్ధోన్మాదాన్ని అరికట్టడానికి అంతర్జాతీయ సమాజం కఠినమైన, సమన్వయంతో కూడిన చర్యలు తీసుకోవాలని కోరారు.

జమ్ముకాశ్మీర్‌లో 'దర్బార్ బదిలీ' పునరుద్ధరణ

జమ్మూ : దర్బార్ బదిలీ పద్ధతిని పునరుద్ధరించనున్నట్లు జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రకటించారు. లెఫ్టినెంట్ గవర్నర్ ఆదేశాల మేరకు నాలుగేళ్ళ పై నుండి ఈ పద్ధతిని నిలిపివేశారు. ఖర్చులు తగ్గించుకునేందుకే ఈ పద్ధతిని నిలిపివేసినా దీనివల్ల జమ్మూ ప్రాంతంలోని వాణిజ్య, వ్యాపార కార్యకలాపాలు కొంతమేరా దెబ్బతిన్నాయి. 1872లో కాశ్మీర్ మహారాజు గులాబ్ సింగ్ ఈ దర్బార్ మూవ్‌ను ప్రవేశపెట్టారు. ఈ పద్ధతి కింద సివిల్ సెక్రటేరియట్, కీలక ప్రభుత్వ కార్యాలయాలు వేసవి కాలంలో శ్రీనగర్ నుండి, శీతాకాలంలో జమ్మూ నుండి పనిచేస్తాయి. దీనివల్ల ఆర్థిక వ్యవస్థకు లాభాలు వుంటాయని సిఎం అన్నారు. ఆమోదం నిమిత్తం ఫైల్‌ను లెఫ్టినెంట్ గవర్నర్‌కు పంపారు.

గ్రామపంచాయతీల పునర్ వ్యవస్థీకరణ!

(మొదటిపేజి తరువాయి)

యూనిట్లుగా ఏర్పాటు చేస్తారు. గ్రామ పంచాయతీలకు గ్రేడింగ్ విధానం కొత్తగా తీసుకొస్తున్నారు. నూతనంగా ఏర్పాటు కానున్న రూర్బన్ పంచాయతీలకు రూరల్ అర్బన్ డెవలప్‌మెంట్ ఆఫీసరుగా (గ్రేడ్-1 కార్యదర్శులను నియమిస్తారు. రూర్బన్ పంచాయతీలు కాకుండా మిగిలిన పంచాయతీలను మూడు గ్రేడులుగా పునర్‌వర్గీకరణ చేస్తారు. ఈ మేరకు పంచాయతీల్లోని ఉద్యోగులు, అధికారుల పోస్టుల అప్‌గ్రేడేషన్, పునర్వ్యవస్థీకరణకు జిల్లాల నుంచి ప్రభుత్వం ఇటీవల ప్రతిపాదనలు స్వీకరించింది. ఆయా పోస్టులకు ప్రత్యేక స్కేల్స్ నిర్ణయించింది. అదనపు